క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన కబడ్డీ క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు బాల బాలికల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 250 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. వీరిలో 20 మంది బాలురను, 20 మంది బాలికలను కోచింగ్ క్యాంప్‌కు ఎంపిక చేసినట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల మోహన్‌రావు యాదవ్ తెలిపారు. వీరు జిల్లా, అంతర్జాతీయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కబడ్డీ సెక్రటరీ సుబ్రమణ్యం, క్రీడా అసోసియేషన్ నాయకులు రామేశ్వరరెడ్డి, ఇప్పా వెంకటేశ్వర్లు, హరికృష్ణ, మమత, రేవతి, తదితరులు పాల్గొన్నారు. హాజరైన క్రీడాకారులందరికీ గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఏపీటీఎఫ్ మహానంది మండల కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం మహానంది మండల ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన కార్యవర్గం కమిటీని ఎన్నుకున్నారు. మహానంది మండల అధ్యక్షుడిగా వై.మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజగోపాల్, మురళీధర్‌రెడ్డి, కోటేశ్వరమ్మ, జయసుధ, మల్లికార్జున, కార్యదర్శులుగా మల్లికార్జునరెడ్డి, రామయ్య, అనూష, జాకీర్‌హుసేన్, శ్రీవిద్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా సుబ్బారెడ్డి, కృష్ణమోహన్, తిమ్మారెడ్డి, బాలసంజమ్మ, నాగేశ్వరరావులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు జీసీ తిమ్మారెడ్డి, జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

17న సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఈనెల 17న నంద్యాలలోని నేషనల్‌పీజీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేశారన్నారు. ప్రతి కార్యకర్త ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. సంస్మరణ సభను జయప్రదం చేయాలన్నారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, రైతు సంఘం నాయకులు సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

డీఏలు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రణభేరి జాతా జయప్రదంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని, ఇది పేద విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న 30 మంది ఏఐటీయూసీలో చేరినట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక కార్మిక భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది.



కందిపోతోంది

కంది రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. మొలక దశ నుంచి వర్షాలు కురుస్తుండటంతో పంటపై తీవ్ర ప్రభావం పడింది. విత్తు వేసి రెండునెలలవుతున్నా కంది మొక్కలు ఎత్తు పెరగడం లేదు. మార్కెట్‌లో కంది మంచి ధర పలుకుతుండటంతో మండలంలో గత మూడేళ్ల నుంచి ఈ పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది కూడా మండలంలో ఖరీఫ్ సీజన్ కింద సుమారు 250 హెక్టార్ల వరకు పంట వేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో నీరు నిలిచిపోయి తేమ శాతం పెరిగిపోయింది. దీంతో పైరు ఎదుగుదల లోపించిందని రైతులు వాపోతున్నారు. పైరును తొలగిద్దామంటే దాదాపు ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు చేరు, అలాగే ఉంచితే దిగుబడులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. –దొర్నిపాడు



శాంతించిన కుందూ

కుందూనదిలో వరద నీటి ఉధృతి తగ్గుముఖం పట్టింది. మండల పరిధిలోని నదీ తీరం వెంట ఉన్న 14 గ్రామాల్లో నీట మునిగిన విద్యుత్ మోటార్లు కొంత వరకు బయటపడ్డాయి. సుద్దమల్ల, ఉయ్యాలవాడ, నర్సిపల్లె, కాకరవాడ, రూపనగుడి, మాయలూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో రైతులు వరి పంటకు నీరు పెట్టుకునేందుకు అవకాశం కలిగింది. ప్రస్తుతం కుందూనదిలో 20 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తూ ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల తగ్గించినట్లు కేసీ కెనాలు అధికారులు పేర్కొన్నారు. అలాగే పంట పొలాల్లో నిలిచిన వరద నీరు కూడా కొద్ది మేర తగ్గుముఖం పట్టింది. దీంతో కుందూ తీరం వెంట ఉన్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. – ఉయ్యాలవాడ

ముగిసిన మాతృభూమికి కళార్చన వేడుకలు



ముగింపు ఉత్సవంలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో కళారాధన సాంస్కృతిక సంస్థ, లయన్స్‌క్లబ్, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో గత 14 రోజులుగా బాలలకు నిర్వహిస్తున్న మాతృభూమికి కళార్చన వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది రామచంద్రారావు, లయన్స్‌క్లబ్ మాజీ చైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. 80 విభాగాల్లో 4వేల మంది విద్యార్థులు పాల్గొనగా 350 మంది విజేతలుగా నిలిచినట్లు కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, రామసుబ్బయ్య, సహదేవుడు, ప్రసాద్, రవిప్రకాష్, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, నాగరాజు, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాడిచర్ల సేవలు ఎనలేనివి



గాడిచర్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్ర్య సమరయోధుడు, పత్రిక రచయిత, గ్రంథాలయ ఉద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అందించిన సేవలు ఎనలేనివని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అన్నారు. గాడిచర్ల 142వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా నంద్యాల నియోజకవర్గానికి, ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి గాడిచర్ల ఎంతో కృషి చేశారన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక రూపొందించడంలో కీలక పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కిశోర్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, నీలకంఠమాచారి, రఫీ, సుబ్బయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17న నిరుద్యోగి ఆవేదనపై సదస్సు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఈనెల 17న జరిగే రాష్ట్ర వ్యాప్త సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిరుద్యోగి ఆవేదన సదస్సు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ. 3వేలు, అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మధు, పాములేటి, అంజి, శంకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను తక్షణమే ఆపేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఆపేయాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు అప్పగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దీని వల్ల రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాల నిర్వహిస్తే తప్ప ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి చెంది సమాజంలో ఉన్న పేద వర్గాలకు ఉచిత వైద్యం అందదన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, నాయకులు ఆనంద్, రఫీపఠాన్, యాకూబ్, ఖాజా మియా, కలాంబాషా పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడిగా ఆనంద్‌గురూజీ



నూతనంగా ఎన్నికైన భారత్ వికాస్ పరిషత్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): భారత్ వికాస్ పరిషత్ సేవా సంస్థ అధ్యక్షుడిగా ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురూజీ ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం స్థానిక ఆయూష్ యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన నంద్యాల బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భారత్ వికాస్ ప్రతినిధులు హాజరయ్యారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ బ్రాంచ్ సెక్రటరీగా విజయేంద్రప్రసాద్, పాలూరు రాజ, ఆంజనేయులు, ధనుంజయవర్మ, వెంకటేశ్వర్లు, సుకుమారంబ తదితరులను కమిటీ మెంబర్లుగా ఎన్నుకోవడం జరిగింది. వైద్య పరంగా, విద్య పరంగా, పేదలకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుంటామన్నారు. అనంతరం సేవా సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కండే శ్యాంసుందర్‌లాల్, మహేష్‌నాయుడు, మేడా మురళీధర్, చిలుకూరి శ్రీనివాస్, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోషక లోపాలను నివారించాలి

కర్నూలు(అగ్రికల్చర్): పంటల్లో పోషకాల లోపాలను సకాలంలో గుర్తించి నివారించకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన సుజాతమ్మ మాట్లాడుతూ.. పంటలకు స్థూల, సూక్ష్మ పోషకాలు మోతాదు మేరకు అవసరమని, తక్కువైతే పంట ఎదుగుదల కోల్పోవడంతో పాటు ఎర్రబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అధిక వర్షాల వల్ల పత్తిలో మెగ్నీషియం లోపం కనబడుతోందన్నారు. నివారణకు మెగ్నీషియం సల్ఫేటు ఒక లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పొలంలో జిగురు అట్టలు ఎకరాకు 10–20 ఏర్పాటు చేయాలన్నారు. యూరియా పరిమితికి లోబడి, ఎంఓపీ ఎకరాకు 20 కిలోలు వేయాలని సూచించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ.. పోషక లోపాలను గుర్తించడంపై ఇన్‌పుట్ డీలర్లు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ మండలాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నాగేశ్వర్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ దొర్నిపాడు మండలం కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావును ఆదివారం మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వైద్యశాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు చెప్పారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



కొండమాయపల్లెలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లెలో ఆదివారం అధికారులు పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. అతిసార వ్యాధితో ఓ వ్యక్తి మృతి అన్న శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి నాయక్ ఉదయాన్నే గ్రామానికి చేరుకొని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలు కాలనీల్లో నిల్వ ఉన్న మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించారు.అనంతరం శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ముందుగా అతిసారంతో మృతి చెందిన గుర్రప్ప ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే కాలనీలో ఇంకా ఎవరికైనా అతిసార వ్యాధి సోకిందా అని ఆరా తీశారు. అలాంటిదేమి లేక పోవడంతో కాలనీ వాసులకు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ, వైద్య సిబ్బంది సూచించారు.

సేవల్లో ఆదర్శం నెరవాటి రవి



నెరవాటి రవిని సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల మహానంది ఆర్యవైశ్య అన్నదాన సత్రం జనరల్ సెక్రటరీగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త నెరవాటి రవికుమార్ సేవా కార్యక్రమాల్లో ఆదర్శమని మిడ్ టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ భవనానికి నెరవాటి రవికుమార్ తండ్రి సత్యనారాయణ తన సొంత స్థలం ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. క్లబ్ సభ్యులుగా ఉన్న రవికుమార్ ప్రతి ఏటా క్లబ్ తరఫున నిర్వహించే కార్యక్రమాలకు తగిన సహకారం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులను ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుబ్బయ్య, మోహన్‌రావు, నరసింహులు, సుబ్రమణ్యం, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, మహబూబ్‌బాషా, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేత.. : నంద్యాల రోటరీ క్లబ్ పీడీజీ కందుకూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులకు రెండు వీల్‌చైర్లను అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు వివేకానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హరినాథ్, రామసుబ్బయ్య, రామచంద్రయ్య, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటల పండుగకు వేళాయె!

- ఎస్‌జీఎఫ్ పోటీలకు ఖరారైన షెడ్యూల్
- ఈనెల 16 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి దశ నుంచే బాల బాలికలు క్రీడలపై ఆసక్తి పెంచుకునేందుకు ప్రతి ఏడాది ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు నిర్వహిస్తుంది. ఈనెల 16 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు ప్రారంభించింది. క్రీడా నైపుణ్యాలు పెంపొందించడం, ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేయడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశమని ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు విశ్వనాథ్, ఆశాజ్యోతిలు తెలిపారు.

పోటీల షెడ్యూల్ ఇలా.. : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన బాల బాలికలకు అండర్–14, 17 పోటీలు, 17వ తేదీన బాక్సింగ్, ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తారు. ఈనెల 18వ తేదీన ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుంది. ఈ పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఎల్జిబులిటీ ఫారాన్ని హెచ్‌ఎం సంతకంతో తీసుకొని రావాల్సి ఉంటుంది. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, కర్నూలు జిల్లా డీఈఓ శ్యామూల్ హాజరవుతున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు వెల్లడించారు.

రైతుకు సన్మానం

గోస్పాడు: సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేస్తున్న గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రైతు బాలమద్దిలేటిని సంతోషం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్న రైతుల సమావేశం జరిగింది. మండలం నుంచి వెళ్లిన తనను మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ, పతంగి రాంబాబు సన్మానించినట్లు బాలమద్దిలేటి తెలిపారు.

యూరియా పంపిణీలో కూట సర్కారు విఫలం



గోస్పాడులో ఏఐకేఎస్ నూతన మండల కమిటీ సభ్యులతో నాయకులు

నంద్యాల(అర్బన్): జిల్లా రైతులకు అవసరమైన యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల అసెంబ్లీ నాయకులు ఈశ్వరరెడ్డి విమర్శించారు. లక్షలాది ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎస్‌డీపీఐ నాయకులు అక్తర్‌హుసేన్, ఇస్మాయిల్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

గోస్పాడు: ఆర్‌ఎస్‌కేల ద్వారా రైతులందరికీ యూరియా అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. ఆదివారం గోస్పాడులో ఏఐకేఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో రైతాంగం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సాగు సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంలో కూటమి సర్కారు విఫలమైందన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శిగా వెంకటరంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మార్క్, కార్మిక సంఘం నాయకులు చెన్నయ్య, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఎస్పీని కలిసిన ఆళ్లగడ్డ సీఐ

ఆళ్లగడ్డ: జిల్లా నూతన ఎస్పీ సునీల్ షేరాన్‌ను నంద్యాలలోని ఆయన కార్యాలయంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ సర్కిల్ పరిధిలోని శాంతి భద్రతల గురించి వివరించినట్లు సీఐ తెలిపారు















